

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 9 ఏప్రిల్ 2024 5



రంజాన్ వేళలు



ఇఫ్తార్ :	సహర్
మంగళవారం	బుధవారం
సా : 6.36 గం..	ఉ : 4.40 గం..



వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్


వడ్డెకొత్తపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్

పెద్దవంగర, ఏప్రిల్ 8 : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్ అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను సోమవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సం దర్భంగా మురళీధర్ మాట్లాడుతూ గర్భిణుల డాటా ఏఎన్‌ఎంల వద్ద ఉండాలని, క్రమం తప్పకుండా వారి వద్దకు వెళ్లి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు జరిగేలా చూడాలని సిబ్బందిని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ప్రతీ బుధ వారం టీకాల పంపిణీ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, టీబీ, మలేరియా రోగులను గుర్తించి సక్రమంగా మందులను పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి వ్యాధులు సోకినా ప్రాథమికంగా గుర్తించి తొలి దశలోనే నయం చేస్తేనే వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందన్నారు. వ్యాధిగ్రస్థులు వైద్య సలహాలు పాటిస్తూ ఆరోగ్యకరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజుకుమార్, ఏఎన్‌ఎం భూబ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 37.5°C | కనిష్ఠం : 25.0°C

పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం

- కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

తొర్రూరు, ఏప్రిల్ 8 : పాలకుర్తి నియోజకవర్గాన్ని తాను మంత్రిగా ఉన్నప్పుడు అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధికి కృషి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తొర్రూరులోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అవకాశవాదిని కాదని, అవకాశం తనను వెతుక్కుంటూ వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, తాను గతంలో ఒకే పార్టీలో పనిచేశామని, తిరిగి కాంగ్రెస్‌లో పనిచేసేందుకే తనను ఆహ్వానించారని తెలిపారు. కాంగ్రెస్ పెద్దల ఆలోచన మేరకే కడియం కావ్యను కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంచడం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభావం కొనసాగిందని, తనపై ఎలాంటి ఆరోపణలు లేకపోవడంతో కొద్ది మెజారిటీతోనైనా గెలిచానని అన్నారు. ప్రతిపక్షంలో ఉంటే నియోజకవర్గ సమస్యలు పరిష్కరించలేనని తెలిపారు. మనవరాలు వయసు ఉన్న యశస్వినిరెడ్డిపై దయాకర్‌రావు ఓడిపోవడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో తాను రెండు సాగునీటి ప్రాజెక్టులు తీసుకువచ్చానని, షైలారం రిజర్వాయర్, బయన్నవాగు నిర్మాణం తన హయాంలోనే జరిగిందని కడియం పేర్కొన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు తన పేరు ఎక్కడా ప్రస్తావన తేలేదని, కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు తీసుకున్నారని ఆరోపించా రు. బీజేపీ మతోన్మాదాన్ని అడ్డుకోవడం కాంగ్రె స్‌తోనే సాధ్యమని, పార్లమెంట్ అభ్యర్థిగా కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. పాలకుర్తిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లు గెలవడం ఖాయమని తె లిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, నాయకులు కె.నిరంజన్‌రెడ్డి, ముత్తినేని సోమేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, సంతోష్, రాజశేఖర్, రాంచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, సంబంధిత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 440 ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశ్యంతో వసతుల కల్పన, తాగునీరు, విద్యుత్, మైనర్ రిపేర్‌లు, బాలికల కోసం టాయిలెట్లు, తదితర సుందరీకరణ పనులను నిర్దేశించిన సమయం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రూపొందించిన ప్రతిపాదనల ప్రకారం... సంబంధిత కమిటీ సభ్యులతో కలిసి పనులు పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం అధికారులు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకు పకడ్బందీగా వ్యూహం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఎండ వేడిమికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించే కూలీలు, ఇటుక బట్టీల కూలీలు, వ్యవసాయ పనులు చేసే వారు తదితర వర్గాల ప్రజలకు ఈ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అందుకోసం ప్రత్యేకంగా జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని, దాని ద్వారా ప్రతిరోజు నివేదికలు సిద్ధం చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పశువుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాసం, తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌వో కళావతిబాయి, డీపీవో హరిప్రసాద్, జడ్పీ సీఈవో రమాదేవి, వెటర్నరీ డాక్టర్ డీఏవో అభిమన్యుడు, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ముఠా అరెస్టు

స్కానింగ్ మిషన్, నాలుగు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం


లింగ నిర్ధారణ పరీక్షల స్కానర్‌ను స్వాధీనం చేసుకున్న కురవి పోలీసులు

కురవి, ఏప్రిల్ 8 : కురవి మండలం తాట్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని పిల్లిగుండ్లతండాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మహబూబాబాద్ రూరల్ సీఐ పి.సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన సంపెట అశోక్(టెక్నీషియన్), పులి వీరభద్రం(ఆస్పత్రి మేనేజర్), కేసముద్రం మండలం అన్నారంకు చెందిన పిట్టల మహేందర్ (టెక్నీషియన్), ఖమ్మం జిల్లా తిమ్మంపేటకు చెందిన దారావత్ విక్రమ్, కురవి మండలం తిర్లాపురంకు చెందిన కత్తి యుగేందర్, ఇదే మండలం పిల్లిగండ్లతండాకు చెందిన భూక్య శివలు ముఠాగా ఏర్పడి లింగ నిర్ధారణ పరీక్షలు రహస్యంగా నిర్వహిస్తున్నారు. పిల్లిగుండ్ల తండాలోని భూక్య శివ ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నారన్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం ఎస్సై బి.గోపి దాడులు నిర్వహించి ముఠాలోని నలుగురిని అరెస్టు చేశారు. అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ మిషన్ సహా నాలుగు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో స్కానింగ్‌కు రూ.6వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో దారావత్ విక్రమ్, కత్తి యుగేందర్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని త్వరలోనే పట్టుకోనున్నట్లు తెలిపారు. ఈ సమాచారాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతిబాయి, స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు బి.స్రవంతిలకు అందించారు. వారు సైతం ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలో సైతం ఇదే విధమైన కేసులు గతంలో నమోదయ్యాయని, ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.









నేడు ఉగాది



- ఆలయాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు
- మానుకోటలో ముస్తాబైన శ్రీరామాలయం
- వైభవంగా సీతారామ కల్యాణ వసంత మహోత్సవం


మహబూబాబాద్‌లో సీతారామ కల్యాణ మహోత్సవాలకు ముస్తాబైన శ్రీరామాలయం


సీతారామ కల్యాణోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : జిల్లా వ్యాప్తంగా శ్రీక్రోధి నామ సంవత్సర తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఆనం దోత్సవాల నడుమ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇంటిల్లిపాది తెల్లవారుజాము నుంచే తలంటు స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి ఇంటి ముంగిట మామిడి ఆకుల తోరణాలు కట్టి షడ్రు చులతో చేసిన ఉగాది పచ్చడితో వేడుకలు జరుపుకోను న్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉన్న దేవాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కవి సమ్మేళనా లు నిర్వహించి కవులు, రచయితలను సన్మానించను న్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు షురూ...

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామాలయంలో ఈ నెల 9న ఉగాది పర్వదినం రోజున 65వ శ్రీసీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17న శ్రీరామనవమి పర్వదినంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, ఎడ్ల రమేష్, నీరుటి సురేష్, నాళ్ల నర్సింహారావు, గిరిధర్‌గుప్తా పాల్గొన్నారు.

మామిడి కాయలు, బంతిపూల అమ్మకాలు...

పట్టణంలోని నెహ్రూ సెంటర్, ప్రధాన కూడళ్లలో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం రోజున చేసే పచ్చడి కోసం ప్రజలు మామిడి కాయలు, బంతి పూలను భారీగా కొనుగోలు చేశారు. తెల్ల చామంతి పూలు కిలో రూ.450, మిగిలిన చామంతి రూ.350 నుంచి 400, మల్లెలు కిలో రూ.700-800, చిన్నగులాబీలు రూ.250-300, బంతిపూలు కిలోకు రూ.80-100 ధరలు పలికాయి.

ఆర్యసమాజ మందిరంలో..

జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజ మందిరం ఆధ్వర్యంలోని పతంజలి ప్రాణయోగ ఆరోగ్యసేవా కేంద్రంలో లోక కల్యాణార్థం దేవ పూజ, అగ్నిహోత్రం వేదమంత్రములతో పూజా కార్యక్రమాలు ఉంటాయని మానుకోట శాఖ ఆర్యసమాజ ట్రస్ట్ అధ్యక్షుడు నారాయణప్రకాష్ లోయ తెలిపారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.





ఘోషిస్తున్న వేద పాఠశాల

నీడ కోసం దీన చూపులు

- మాడవీధుల నిర్మాణంతో కోల్పోతున్న భవనం
- ధార్మిక భవన్‌లోకి తరలించే ప్రతిపాదన
- ససేమిరా అంటున్న దేవాదాయశాఖ అధికారులు
- మూతపడే దిశగా పాఠశాల
- రోడ్డునపడనున్న విద్యార్థులు

హనుమకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి గుడి ప్రాంగణంలో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న వేద పాఠశాల ప్రత్యామ్నాయ నీడ కోసం పరితపిస్తోంది. ధార్మిక భవన్‌లో కాసింత చోటిస్తే అందులో సర్దుకొనేందుకు సిద్ధపడుతోంది. కానీ దేవాదాయ శాఖ అధికారులే వసతి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దీనితో వేద పాఠశాల ఉనికి ప్రశ్నార్థకంగా మారనున్నది. అందులో వేదం అభ్యసిస్తున్న విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడనుంది.

ఎన్నో ఏళ్లుగా...

వరంగల్‌లో సుప్రసిద్ధమైన భద్రకాళి దేవాలయ ప్రాం గణంలో వేద పాఠశాల ఎన్నో ఏళ్లుగా నడుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఆలయాల ఆధ్వర్యంలో నడుస్తున్న అయిదు వేద పాఠశాలల్లో ఇది ఒకటి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి వేద పాఠశాల ఇది. వేలాది మంది విద్యార్థులను వేదపండితులుగా తీర్చిదిద్దిన ఘన చరిత్ర ఈ పాఠశాలకు ఉంది. ఇక్కడ వేదం నేర్చుకొని వేదపడింతులుగా, అర్చకులుగా అనేక మంది పలు దేవాలయాల్లో స్థిరపడ్డారు.. ఇప్పుడు ఈ పాఠశాల ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

కూల్చివేతకు గురికానున్న భవనం

భద్రకాళి దేవాలయం చుట్టూర రూ.30 కోట్ల వ్యయంతో మాడవీధుల నిర్మాణాన్ని చేపట్టింది తెలిసిందే. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. మాడవీధుల్లో కొంత భాగంగా భద్రకాళి చెరువు మీది నుంచి నిర్మాణం కాగా, మిగతా సగ భాగం ఆలయం వెనుక నుంచి నిర్మాణం కానుంది.. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న వేదపాఠశాల భవనాన్ని తొలగించాల్సిన అనివార్యత ఏర్పడింది. దీంతో పాఠశాలను మరోచోటికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా పాఠశాలను ఇటీవల పాతసెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిను ధార్మిక భవనంలోకి తరలించాలనే ప్రతిపాదన చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఈ ఇద్దరు సుముఖత వ్యక్తం చేశారు. కానీ దేవాదాయ శాఖ అధికారులే ససేమిరా అంటున్నట్టు తెలుస్తోంది. పాఠశాల నిర్వహణకు అవసరమైన చోటు భవన్‌లో లేదని, పైగా ఇక్కడ పాఠశాలను నిర్వహిస్తే ఇందులోని కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది విధులకు ఆటంకంగా ఉంటుందన్న సాకులను చూపుతున్నట్టు సమాచారం.

ధార్మిక భవనంలో దొరకని చోటు:

ధార్మిక భవనాన్ని ఇటీవలే రూ.3 కోట్ల వ్యయంతో మూడంతస్తులతో నిర్మించారు. ఇందులో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఉండాల్సిన సమ్మక్క సారలమ్మ జాతర ఈవో కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఈ మూడు ఆఫీసులకు ఇంత పెద్ద విశాలమైన భవనం అవసరమే లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఆఫీసులకు పోను వేద పాఠశాల నడవడానికి అవసరమైన చాలా స్థలం ఈ భవనంలో ఉంది. అయినా కూడా దేవాదాయ శాఖకు అనుబంధంగా నడుస్తున్న వేద పాఠశాలను తమ దరదాపుల్లోకి రాకుండా అధికారులు అడ్డుపడుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ధార్మిక భవనం నిర్మాణంలో భద్రకాళి గుడి నుంచి రూ. కోటి వాడుకున్నారు. మడికొండలోని మెట్టుగుట్ట ఆలయం నుంచి రూ. కోటి, సమ్మక్క సారలమ్మ జాతర దేవస్థానం నుంచి రూ.కోటి వాడుకున్నారు. భద్రకాళి గుడి నిధులు మాత్రం తీసుకుంటారు గానీ ఆ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేదపాఠశాలకు మాత్రం ధార్మిక భవన్‌లో కాసింత చోటివ్వడానికి నిరాకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి, కలెక్టర్ ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేస్తున్నారు.



మాడవీధుల నిర్మాణంతో తొలగించనున్న భద్రకాళి ప్రాంగణంలో ప్రస్తుతం ఉన్న వేద పాఠశాల భవనం

మంత్రితో పాటు విజిలెన్స్ ఆరా..

ధార్మిక భవనంలో మరో అంతస్తు నిర్మాణానికి మెట్టురామలింగేశ్వర దేవాలయం ఆదాయం నుంచి దేవాదాయశాఖ అధికారులు రూ.50 లక్షలు తీసుకోవడంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్టు తెలుస్తోంది. 'దేవుడి సొమ్ముకు ఎసరు' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త కథనానికి స్పందించిన మంత్రి ఆరా తీసినట్టు సమాచారం. ఇంటలిజెన్స్ అధికారులు సైతం స్పందించారు. ధార్మిక భవనంలో ఫర్నీచర్ కోసం మరో రూ.30 లక్షలను మూడు దేవాలయాల నుంచి తీసుకోవడంపై కూడా వివరాలను సేకరిస్తున్నట్టు సమాచారం. అంతే కాకుండా అంతకు ముందు భద్రకాళి గుడి ప్రాంగణంలోని భవనంలో గతంలో దేవాదాయశాఖ కార్యాలయాల సముదాయంలోని సుమారు రూ.10 లక్షల విలువైన ఫర్నీచర్ ఏమైందనే విషయమై కూడా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

రోడ్డునపడనున్న విద్యార్థులు

ధార్మిక భవనంలో వేదపాఠశాలకు చోటు దొరకని పక్షంలో వేద పాఠశాల నెలవు కోల్పోయి ప్రత్యామ్నాయ మార్గం లేక చివరకు మూతపడే పరిస్థితి ఏర్పడున్నది. దీంతో ఇందులో చదువుకుంటున్న విద్యార్థులు వీధినపడనున్నారు. వాస్తవానికి ఈ వేద పాఠశాలను ఆలయ ప్రాంగణం నుంచి మరో చోటికి తరలించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుత భవనం ఆలయం కట్టకింద లోతట్టున ఉండడంతో భారీ వర్షాలు వచ్చిన ప్రతీసారి ఇందులోకి వరద నీరు ప్రవేశిస్తోంది. విద్యార్థుల పుస్తకాలు, వస్తువులు తడిసిపోతున్నాయి. వరదనీటి ప్రవాహంతో పాములు భవనంలోకి కొట్టుకువస్తున్నాయి. దీనితో భారీ వర్షాలు పడిన ప్రతీ సారి విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత సంవత్సరం జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు విద్యార్థులు వరదనీటిలో చిక్కుకుపోయారు. అతికష్టం మీద వారిని బయటకు రప్పించారు. కొద్ది రోజులు పాఠశాల మూతపడింది. కొత్త అడ్మిషన్లలో జాప్యం ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకలి పోటులా మాడవీధుల నిర్మాణం వల్ల ఉన్న భవనం కూడా కోల్పోతుండడంతో వేద పాఠశాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. దాని నిర్వహణపై నీలినీడలు పరుచుకుంటున్నాయి. ఈ క్రమంలో మాడవీధుల నిర్మాణం తర్వాత అనువైన స్థలంలో స్వంత భవనం నిర్మాణం అయ్యే వరకు తాత్కాలికంగా పాఠశాలను ధార్మిక భవన్‌కు తరలించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది. పాఠశాల నిర్వాహకులు అక్కడి మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోగా దేవాదాయ శాఖ అధికారులు మోకాలు అడ్డుతుండడంతో తరలింపుపై అనిశ్చిత పరిస్థితి నెలకొన్నది. మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఈ విషయంలో చొరవ తీసుకొని ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలేలా చూడాలని కాకతీయ వారసత్వ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజుతో పాటు పలువురు ధార్మికవేత్తలు, వేదపండితులు కోరుతున్నారు.



కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటా..

మాట్లాడుతున్న అరూరి రమేశ్

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్

ధర్మసాగర్, ఏప్రిల్ 8: కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని వరంగల్ పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. సోమారం ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చట్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మసాగర్, వేలేరు మండలాల విస్తృత స్థాయి సమావేశానికి ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తల అందరినీ కలుపుకొని పార్టీ కోసం పని చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మోదీ నాయకత్వంలోని బీజేపీలో చేరానన్నారు. మాజీ మంత్రి విజయ రామారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, ప్రధాన మంత్రి చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూబీజేపీ 400సీట్లు గెలిచే అవకాశం ఉందన్నారు. కడియం శ్రీహరి బిడ్డ కోసం నీతి మాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ పేదవాడికి న్యాయం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. ఎంపీ అభ్యర్థి రమేశ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆనంతరం తాటికాయల గ్రామానికి చెందిన యువకులు అరూరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయరావు, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



బొమ్మగాని నిర్మల (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన జనగామ జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాకేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల (65) స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఇంటి నుంచి హోటల్‌కు రోజు నడుచుకుంటూ వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో రెండు క్రితం హోటల్ నుంచి ఇంటికి ఎండలో నడుకుంటూ రాగా అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌గౌడ్ ఓ దిన పత్రికలో రిపోర్టరుగా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పలువురి పరామర్శ

వడదెబ్బతో మృతిచెందిన నిర్మల కుమారుడు శ్రీకాంత్‌గౌడ్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎంతో పాటు పలు పార్టీల నాయకులు, జర్నలిస్టులు పరామర్శించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు రాంచందర్, జక్కుల అనిత, సీపీఎం భువనగిరి అభ్యర్థి ఎండి.జహంగీర్, సీపీఎం నేతలు బూడిద గోపి, జోగు ప్రకాశ్ తదితరులు పరామర్శించారు. శ్రీకాంత్‌గౌడ్‌కు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. శ్రీకాంత్‌గౌడ్ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో జనగామ జర్నలిస్టులు, పలువురు నేతలు ఆర్థికసాయం అందించారు.

నేటినుంచి భద్రకాళి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8 : వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి 17వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషభారతి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది రోజున మంగళవారం అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించడంతో నవరాత్రి రథం ప్రారంభమవుతుందన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ తన సృష్టిని పూర్తి చేశాడని శ్రీభద్రకాళి అమ్మవారే బ్రహ్మ స్వరూపమని వసంత నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజిస్తే అన్ని శుభాలు కలుగుతాయని తెలిపారు.

ఎంజీఎంలో రేడియాలజీ విభాగంలో ఆగిన సేవలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో సోమవారం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎక్స్‌రే మిషన్‌లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఒకటి మాత్రమే గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తోంది. మరో రెండు మిషన్లు ఉన్నా అవి మొబైల్ ఎక్సరే కావడంతో సేవలు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. సోవవారం ఓపీ, ఐపీ రోగులు అధికంగా రావడంతో ఎక్స్‌రే మిషన్లు పని చేయక ఇబ్బంది పడ్డారు. చివరకు మొబైల్ ఏక్సేంజ్ మిషన్ పై ఎమర్జెన్సీ రోగులకు ఎక్స్‌రేలు తీశారు. పనిచేయని డిజిటల్ ఎక్సరే మిషన్‌ను రిపేర్ చేయిస్తామని అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8: హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిసరాల్లో రూ.13 లక్షల విలువైన పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ పరిధిలో పెద్దఎత్తున పీడీఎస్ రైస్ దందా నడుస్తుందనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నిఘా వేసి బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ నగరానికి చెందిన జన్ను అనిల్ అనే వ్యక్తి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి లారీలో మహారాష్ట్రకు తరలించేందుకు యత్నిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. 680 బ్యాగులతో కూడిన లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ సునిల్‌ను, అక్రమ దందా చేస్తున్న అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయన్ని హసన్‌పర్తి పోలీసులు ధృవీకరించారు.

అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 : వాట్సాప్ లింకు ఓపెన్ ద్వారా వచ్చే డబ్బులకు ఆశపడి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాయపురకు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఓ వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ ఐడికి కనెక్ట్ అయ్యాడు. అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి కంపెనీ మేనేజర్‌గా చాట్ చేసి ట్రేడింగ్ ద్వారా డబ్బులను డబుల్ చేసుకోవచ్చని ఆశ కల్పించాడు. వారిచ్చిన ఐడికి మూడు దశలో 7,000 ట్రాన్స్‌ఫర్ చేయగా తిరిగి 8,327 రూపాయలు ఇబ్రహీంకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఇన్వెస్ట్ చేయమని చాట్ చేయగా 5,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇంకొక 30,000 చేస్తే విత్ డ్రా ఆప్షన్ వస్తుందని చెప్పగా 30,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయినా విత్ డ్రా ఆప్షన్ రాకుండా మరోక సారి డబ్బులు ఇన్వెస్ట్ చేయాలని అడగడంతో మోసపోయినని గ్రహించిన బాధితుడు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పున్నేలులో మద్యం పట్టివేత

ఐనవోలు, ఏప్రిల్ 8 : అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం పున్నేలు గ్రామంలో రావుల రాజు అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం నిల్వచేసి విక్రయిస్తుండగా తనిఖీలు నిర్వహించి రూ.7821 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకొని అయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యత

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్నత విద్యకు దూరం
- వర్సిటీలకు యూజీసీ నిధులు తగ్గాయి..
- ప్రముఖ సామాజిక వేత్త, ప్రొఫెసర్ హరగోపాల్
- కేయూలో ఉన్నత విద్యపై సింపోజియం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 : అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యతని ప్రముఖ సామాజిక వేత్త, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానంద అధ్యక్షతన సింపోజియం నిర్వహించారు. 'తెలంగాణలో ఉన్నత విద్య ప్రస్తుత పరిస్థితులు-బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధానాలు' అనే అంశంపై హరగోపాల్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఉన్నత విద్యకు దూరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ నిధులు బాగా తగ్గించారని చెప్పారు. పరిశోధన ప్రాజెక్టులు నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రైవేట్, వాణిజ్యపరం కావడంతో తరువాతి తరం వారు సేవ దృక్పథాన్ని మరిచి వాణిజ్య పరంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ బ్యాంకు నిబంధనల మేరకు విద్య ప్రైవేట్ పరం అవుతోందని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గత కొన్నేళ్లుగా విద్య రంగంపై ప్రభుత్వాలు నియమించిన కమిటీలు వాటి సిఫార్సులను వివరించారు. ప్రపంచంలో నిరంతరం ఎదురవుతున్న పోటీలకు దీటుగా ప్రభుత్వ విద్య సంస్థలుండాలని అన్నారు.

రాష్ట్రంలో విద్య రంగంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో ప్రగతి ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. రాష్ట్రంలోని 99 డిగ్రీ కళాశాలలు న్యాక్ గ్రేడింగ్ పొందాయని చెప్పారు. దేశంలో బెస్ట్ ప్రాక్టీస్‌గా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ నిలుస్తోందని చెప్పారు. అన్ని కళాశాలల్లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలవుతున్నాయని చెప్పారు. విద్య లక్ష్యం విద్యార్థి వికాసం, ఉపాధి, ఆత్మ విశ్వాసం కావాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్య రంగ పురోగతికి ప్రభుత్వాలు చాలా కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ స్పష్టత రాలేదని వివరించారు. 75 ఏళ్ళ భారతంలో గుణాత్మక విద్య అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తక్కువగా ఉందన్నారు. వర్సిటీలు క్రాస్ రోడ్డులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ రిటైర్డు చైర్మన్ సుఖదేవ్ థోరట్ జూమ్ వెబ్‌సైట్‌లో సమావేశంలో మాట్లాడారు. యూజీసీ బడ్జెట్ కోత ఉందని చెప్పారు. ప్రభుత్వం పరిశోధనలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలు స్టూడెంట్స్ కేంద్రంగా ఉండాలని అన్నారు. జీడీపీలో విద్య రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని అన్నారు. సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఎస్డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హైయర్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ తాటం శ్రీనివాస్, ప్రొఫెసర్ గాదె దయాకర్, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, చింత సమ్మయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కృష్ణమాచారి, సంజీవరెడ్డి, సాయులు, దీపాజ్యోతి, రామస్వామి, ఇంద్రాసేనారెడ్డి, రామిరెడ్డి, కట్ల రాజేందర్, ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే, రాంనాథ్‌కిషన్, సక్రియా, ప్రొఫెసర్ శోభ, ఎఆర్ పెండ్లి అశోక్‌బాబు పాల్గొన్నారు.

16న 'స్వీప్' ఆధ్వర్యంలో 5కే రన్



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 8 : ఓటు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేసేలా స్వీప్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 5కే రన్ కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ 16న ఉదయం 6 గంటలకు హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం నుండి రన్ ప్రారంభమై హనుమకొండ కలెక్టరేట్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ పరుగులో విద్యార్థులు, యువత, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 5కే రన్ విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో సోమవారం కొత్త ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచడం పై విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వినోద్‌రావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ శబరీశ్, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8: ములుగులో జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టాలని మల్టీజోన్-1 ఐజీ ఎ.వి.రంగనాథ్ అన్నారు. ఎన్‌డీపీఎస్‌పై ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్, జిల్లా పోలీస్ అధికారులతో ఐజీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, డ్రగ్స్ సరఫరా నిలుపుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటుచేసి ఇప్పటికే 757.625 కిలోల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేశామని, తెలిపారు. ఇటీవల మరిన్ని కేసులు నమోదు చేశామని అన్నారు. గంజాయి సరఫరాను అడ్డుకునే లక్ష్యంగా అంతర్రాష్ట్ర, జిల్లా రహదారుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలకు గంజాయి వాడకం పట్ల కలిగే దుష్పలితాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐజీకి వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, ఏటూరునాగారం, పస్రా సీఐలు రంజిత్‌కుమార్, రాజు, శంకర్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, కమలాకర్, కృష్ణప్రసాద్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఉచితంగా నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో 4వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. ఈ శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈ నెల 25వ తేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో వివిధ క్రీడా అంశాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో పే అండ్ ప్లే పద్ధతిన ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అశోక్ సూచించారు.

పెళ్లింట విషాదం.. విద్యుదాఘాతంతో రైతు మృతి



చందర్ (ఫైల్)

ఖానాపురం, ఏప్రిల్ 8 : పెళ్లింట విషాదం నెలకొంది.. ఈనెల 24న కుమారుడి వివాహం కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. విద్యుదాఘాతంతో సోమవారం రైతు మృత్యువాత పడడంతో ఖానాపురం మండలం కొడ్తిమాట్‌తండాలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..

కొడ్తిమాట్‌తండాలకు చెందిన బానోతు చందర్(52)కు భార్య ఇద్దరు కుమారులున్నారు. కాగా, తనకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, అపరాల సాగు చేస్తున్నాడు. పంటకు తన వ్యవసాయ బావి నీరు సరిపోకపోవడంతో సమీపంలో ఉన్న తన చిన్నాన్న(సమీప బంధువు) బావి నుంచి కొన్ని రోజులుగా నీటిని వాడుకుంటున్నాడు. రోజులాగే మోటార్ స్టాటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య హచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. చందర్ చిన్నకుమారుడు శివకు ఈనెల 24 వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బట్టలు, బంగారం కొనుగోలు చేశారు. పెండ్లి పనుల్లో ఉండగానే చందర్ మృతి చెందడంతో పెళ్లింట్లో విషాదం నెలకొంది.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



శివ (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 8: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చిట్యాల మండలం ముచినిపర్తి శివారు వెంకటేశ్వర్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన నాగుల శివ (26) వ్యక్తిగత పని నిమిత్తం గణపురం మండలం కర్కపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘన స్థలాన్ని ఎస్సై-2 షాఖాన్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లావణ్య, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



మృతురాలు నాగమణి

నర్మెట, ఏప్రిల్ 8 : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని లోక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హన్మచంద్రుతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హన్మచంద్రుతండాకు చెందిన బానోతు వేణు నాగమణి(21) భార్యభర్తలకు గత కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నాగమణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎక్కువ మోతాదులో తాగడంతో ఇంట్లోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగమణి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగమణి మృతికి భర్త వేణు వేధింపులే కారణమని, కొట్టి చంపి ఉంటాడని మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి మూడు నెలల చిన్న బాబు ఉన్నాడు. భర్త వేణుపై చర్యలు తీసుకోవాలని జనగామ ఏరియా ఆస్పత్రి ఎదుట మృతురాలు బంధువులు గొడవ చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్‌ను వివరణ అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఐస్‌క్రీంలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు కలుపలేదు

- జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి

నెక్కొండ, ఏప్రిల్ 8 : నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐస్‌క్రీం బండిలో వ్యర్థ పదార్థాలు (మూత్రం, వీర్యం) కలిపి అమ్ముతున్నట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అవాస్తవమని జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి పి.అమృతశ్రీ సోమవారం రాత్రి తెలిపారు. ఐస్‌క్రీంలో వ్యర్థ పదార్థాలను కలిపి అమ్ముతున్న విషయమై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 19న బండి యజమాని కాలురాంపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు అతను విక్రయించిన ఐస్‌క్రీం సంబంధించి నాలుగు నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాల హైదరాబాద్‌కు పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కానీ ఐస్‌క్రీం పదార్థాలో (మనిషికి సంబంధించి మూత్రం, వీర్యం) ఎలాంటి వ్యర్థాలు కలువలేదని ల్యాబ్ అధికారులు తెల్పినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమంలో వచ్చే వీడియోలను సరైన పద్ధతిలో నిర్ధారించుకొని, ఆహార అధిదీకృత అధికారుల తనిఖీల తర్వాత ప్రజలు నమ్మాలన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న సీసీఎఫ్



సీసీఎఫ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మంగపేట, ఏప్రిల్, 8: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కాళేశ్వరం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ప్రభాకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు రాజశేఖరశర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ స్వాగతం పలికారు. గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.సీసీఎఫ్ వెంట తాడ్వాయి ఎఫ్ఆర్వో సత్తయ్య, మంగపేట డిప్యూటీ రెంజర్ కోటేశ్వర్, ఇతర ఫారెస్ట్ ఉద్యోగులు ఉన్నారు.

చలివేంద్రాల ప్రారంభం



కల్వలలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

కేసముద్రం, ఏప్రిల్ 8 : మండలంలోని కల్వలలో నవయువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. తొలిరోజు లింగాల పిచ్చయ్య సహకారంతో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అరుణజ్యోతి, పెరుమాండ్ల ఎల్లగౌడ్, కొంతం శ్రీను, గంట బాలకృష్ణారెడ్డి, చందా గోపి, యూత్ సభ్యులు కుదురుపాక సందీప్, ప్రశాంత్, ఉమేష్, చందు, కిట్టు, శ్రీధర్, యాకాంబ్రం, రాజశేఖర్, గణేష్, సాయి, శరత్ పాల్గొన్నారు.

● మరిపెడ రూరల్ : వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందని వైస్ ఎంపీపీ గాదే అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిల్లంచర్లలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయన్నారు. బాటసారుల దప్పిక తీర్చడానికి ప్రతీ ఏడాది రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జన వికాస సిబ్బంది స్వర్ణలత, స్వరూప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● మరిపెడ : మరిపెడ గ్రామంలో మరిపెడ బాలవికాస ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేసి ఆ సంస్థ మండల కో-ఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలవికాస ద్వారా అమలవుతున్న వివిధ సామాజిక కార్యక్రమాలను వివరించారు. సహ కో-ఆర్డినేటర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 8 : హమాలీ కార్మికులకు ఉపాధితో కూడిన సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని లేబర్ కార్యాలయంలో ఏసీఎల్, ఏఎల్‌వో రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ... నిత్యం బరువులు మోసే హమాలీలకు ఎలాంటి పనిభద్రత, సంక్షేమ బోర్డు లేకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం హమాలీ మిల్ వర్కర్స్‌కు ఉపాధితో కూడిన సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. హమాలీ కార్మికులకు కనీసం నెలకు రూ.26వేలు వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్, బోనస్, ప్రమాద బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో పర్వత కోటేష్, సురేష్, రాజ్‌కుమార్, లింగన్న, వెంకన్న,ఉపేందర్, వీరభద్రం పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



నెల్లికుదురులో ఇఫ్తార్ విందులో ముస్లింలతో ఎమ్మెల్యే మురళీనాయక్, తొర్రూరులో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మహబూబాబాద్ విందులో పాల్గొన్న విద్యుత్ అధికారులు

మహబూబాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ డివిజన్ విద్యుత్ శాఖ(ఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలోని అధికారులు ఉపవాసాలు ఉంటూ ఎండలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించడంతో పాటు దీక్ష చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతీ ముస్లిం నిష్ఠతో ఖురాన్‌ను పఠిస్తారని తెలిపారు. డీఈ విజయ్ అధ్యక్షతన జరిగిన ఇఫ్తార్ విందులో ఏడీఈలు శ్రీనివాస్, రమేష్, ఏఈలు సుమన్, శశిధర్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అజీమ్‌ను విద్యుత్ ఉద్యోగులు సన్మానించారు.

● తొర్రూరు రూరల్ : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని శ్రీనివాస గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పవిత్రమైన ప్రార్థనలు, ఉపవాసాలతో అల్లా దీవెనలు పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, సోమేశ్వర్ రావు, తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : మండల కేంద్రంలోని మసీద్‌లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ హాజరయ్యారు. మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ముస్లిం సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ మండల అధ్యక్షుడు ఎండీ రహిమాన్, యాకూబ్ పాషా, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రత్నపురం యాకయ్య, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, రంజిత్‌రెడ్డి, వెన్నం క్రాంతి, రావుల సతీష్ పాల్గొన్నారు.

వెంచర్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

▸▸ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



దోర్నకల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

డోర్నకల్, ఏప్రిల్ 8 : వెంచర్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెంచర్ నిర్వాహకులు నిబంధనల మేరకు లే-అవుట్‌కు అనుమతులు పొందాలన్నారు. మునిసిపల్ పరిధిలోని సర్వే నెంబర్-60లో ఇటీవల కొందరు వ్యక్తులు 3.3 ఎకరాల్లో నూతనంగా వెంచర్ ఏర్పాటు చేశారు. ఆ వెంచర్‌కు ఆనుకుని కుంట ఉండడంతో వర్షాకాలంలో నీరు వచ్చి కుంట అలుగుపోస్తే నీరు ఎటువైపు వెళ్తుందో వెంచర్ నిర్వాహకులు మ్యాప్‌లో పేర్కొనలేదు. దీంతో ఇది గమనించిన కలెక్టర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలుగు నీరు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేసిన తర్వాతనే అనుమతులు తీసుకోవాలని వెంచర్ నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులు ఉన్నారు.

ఆదివాసీల రాజ్యాధికారం కోసం మరో పోరాటం

జాతీయ ఆదివాసీ సంఘాలు, రాజకీయ జేఏసీ పిలుపు

బయ్యారం, ఏప్రిల్ 8: ఆదివాసీల రాజ్యాధికారం కోసం మరో పోరాటం చేయాల్సి ఉంటుందని చందా లింగయ్య దొర పిలుపునిచ్చారు. బయ్యారం మండలం చర్లపల్లి గ్రామంలో ఆదివాసీ సంఘాల రాజకీయ జేఏసీ సభ సోమవారం జరిగింది. పలువురు జేఏసీ ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా చందా లింగయ్య దొర మాట్లాడుతూ తెలంగాణలో షెడ్యూల్డ్ తెగలకు ఆదిలాబాద్, మహబూబాబాద్ రెండు పార్లమెంటు స్థానాలు ఉండగా మానుకోట పార్లమెంటు స్థానంలో అన్ని రాజకీయ పార్టీలు లంబాడీలకు మాత్రమే నాలుగు దఫాలుగా టికెట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. దీంతో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు.

2019 పార్లమెంటు ఎన్నికల్లో అవసర దశలో ప్రాణాలు కోల్పోయే స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీని, ఆదివాసీలను దగా చేస్తున్న టీఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్‌కు అధిక స్థానాలు కల్పించింది ఆదివాసీలేనని తెలిపారు. మానుకోట పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా అందులో ఆదివాసీల ఓట్లు 4.50 లక్షలకు పైగా ఉండగా, లంబాడీల ఓట్లు 3.50 లక్షల ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఓట్ల సంఖ్యలో ఆదివాసీలు ఎక్కువగా ఉన్నా సీట్లు కేటాయించడంలో తీరనిఅన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ ఆదివాసీల ఐక్యత కోసం సమావేశాలు, సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయఅధ్యక్షుడు పూనెంశ్రీనివాస్, తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు రమణల లక్ష్మయ్య, అడ్వయిజర్ పొడుగు శ్రీనాథ్, బూరక యాదగిరి, తాటి స్వామి, వజ్జ నర్సింహరావు, మోక్కాళ్ల భాస్కర్, దారం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

30 లోపు పన్ను చెల్లిస్తే రాయితీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : మహబూబాబాద్ పట్టణ ప్రజలు ఈ నెల 30వ తేదీ లోగా ఇంటి పన్ను చెల్లిస్తే 5 శాతం మినహాయింపు ఉంటుందని మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ సోమవారం తెలిపారు. పట్టణ ప్రజలు 2024-25 సంవత్సరం ఇంటి పన్ను ఇంటి నెంబర్‌తో, పాత డిమాండ్ నోటీస్‌తో గాని చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పట్టణప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను చెల్లింపుదారులు మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో లేదా సంబంధిత బిల్ కలెక్టర్లకు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో చెల్లించవచ్చన్నారు.

మధ్యాహ్నంవేళ ఎండలో తిరుగొద్దు

దంతాలపల్లి, ఏప్రిల్ 8: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎండలో మిట్ట మధ్యాహ్నం సమయంలో తిరుగొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం పంపిణీ చేసిన మందుల వివరాలు, ప్రసవాలు, సబ్ సెంటర్ పరిధిలో ఉన్న పల్లె దవాఖానాలో అమలవుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యురాలు చైతన్య, సీహెచ్‌వో బాలాజీనాయక్, సిబ్బంది సత్తి, చలపతి, శ్రీను పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ



కేసముద్రంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్‌లను పంపిణీ చేస్తున్న సీఐడీ ఎస్ఐ హఫీజున్నీసాబేగం

కేసముద్రం, ఏప్రిల్ 8: కేసముద్రం స్టేషన్‌కు చెందిన 100 మంది నిరుపేద ముస్లింలకు స్థానికురాలైన సీఐడీ ఎస్ఐ ఖాజా హఫీజున్నీసాబేగం తన తండ్రి గోరేమియా జ్ఞాపకార్థం సోమవారం రంజాన్ పండుగకు సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హఫీజున్నీసాబేగం మాట్లాడుతూ తన తోటి ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈసారి కూడా కిట్లను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, నవ్‌జవాన్ యూత్ బాధ్యులు మహ్మద్ షబ్బీర్, మున్వర్, నవాజ్ అహ్మద్, షేక్ హాషాం, హఫీజ్, ఖలీల్, నూరొద్దీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలపై తనిఖీలు చేపట్టాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 8 : జిల్లాలో శీతల పానీయాలు విక్రయించే కేంద్రాలపై, కల్తీ, నకిలీ ఆహార పదార్థాలు విక్రయించే ఫుడ్ సెంటర్లపై, బిర్యానీ సెంటర్లు, బేకరి, స్వీటు షాపులు, హోటళ్లపై తనిఖీలు నిర్వహించాలని మహబూబాబాద్ వినియోగదారుల సంక్షేమ మండలి సభ్యులు జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో వేసవి దృష్ట్యా శీతలపానీయాలు నాణ్యతా లోపంతో ఉంటున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లాలో విచ్చలవిడిగా బిర్యానీ కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యత ప్రమాణాలు లేని కలర్లు, ఇతర పదార్థాలు ఉపయోగిస్తుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. ఆహార కల్తీని అరికట్టడానికి మొబైల్ వ్యాన్‌ల ద్వారా వినియోగదారులకు అవగాహన కల్పించాలని వినియోగదారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాసులు, కోశాధికారి లక్ష్మయ్య, విష్ణువర్ధన్, షేక్ జానీలు కోరారు.

బైరటీస్ రాయి అక్రమ తరలింపును అడ్డుకోవాలి



బైరటీస్ రాయిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

గార్ల, ఏప్రిల్ 8 : గార్ల మండలం శేరిపురం ఆటవీ ప్రాంతంలోని బైరటీస్ రాయి అక్రమ తరలింపునకు అధికారులు అడ్డుకట్ట వేయాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్ అన్నారు. సోమవారం శేరిపురం ఆటవీ ప్రాంతంలోని బైరటీస్ రాయిని పరిశీలించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంట్రాక్టు పొందిన విశ్వభారతి మైనింగ్ సంస్థ వెలికి తీసిన రాయిని కొందరు స్థానిక మైనింగ్ మాఫియాతో కుమ్మక్కై రాత్రి సమయాల్లో అధికారుల అండదండలతో తరలిస్తున్నారని ఆరోపించారు. ఫారెస్టు అధికారుల నిఘా లోపంతో బైరటీస్ రాయి ఆంధ్రాకు తరలిపోతుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి కృష్ణాగౌడ్, పోలంపల్లి భిక్షపతిగౌడ్, శ్రీనివాస్, విఠల్ నాయక్ పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



దోర్నకల్‌లో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు



మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

డోర్నకల్, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అదనపు డీఆర్‌డీవో జయశ్రీ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో అంగన్‌వాడీ, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఓటుహక్కుపై సోమవారం రైల్వేస్టేషన్ నుంచి గాంధీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది చాలా విలువైనదని, ఓటువేయడం ద్వారా తమకుఇష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. అలాంటి ఓటును అమ్ముకోవద్దని సూచించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మున్వర్‌బేగ్, ఆర్.రామ, ఐసీడీఎస్ సీడీపీవోఎల్లమ్మ, సెర్ప్ ఏపీఎం శంకర్ నాయక్, సీసీలు స్వర్ణలత, నళిని, కవిత, రాధ, మంజుల పాల్గొన్నారు.

● మహబూబాబాద్ రూరల్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండడంతో పాటు వినియోగించుకోవాలని మహాలక్ష్మి మండల సమాఖ్య అధ్యక్షురాలు గీత, ఏపీఎం తిలక్ అన్నారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఓటుహక్కుపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీవోఏలు, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● మరిపెడ : ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మరిపెడ మండల ఏపీఎం రాములునాయక్ అన్నారు. సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఐకేపీ సిబ్బంది, మండల సమైఖ్య బాధ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు ఓటరు అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ నేతల తలరాతలను మార్చేది ఓటేనని గుర్తు చేశారు. సీసీలు రుక్మిణి, శ్రీను, మంగమ్మ, జానీ, చందూలాల్, నాగిరెడ్డి, సీహెచ్.కరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : చిన్నగూడూరు మండల కేంద్రంలో దాశరథి సెంటర్‌లో క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా ఎంపీవో యాకయ్య, ఏపీఎం పాపయ్య ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత, సీసీలు మల్లేశం, పుల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మౌంటెనర్ యశ్వంత్‌ను అభినందించిన గవర్నర్



యశ్వంత్‌ను అభినందిస్తున్నగవర్నర్

మరిపెడ, ఏప్రిల్ 8 : మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన భూక్యా యశ్వంత్‌ను రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ సోమవారం రాజ్ భవన్‌లో అభినందించారు. యశ్వంత్ కొద్ది రోజుల్లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి శిక్షణ పూర్తిచేశాడు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌కి వెళ్లి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా యశ్వంత్ కలిశారు. ఎవరెస్ట్ శిఖరాన్ని జయించడానికి తాను సిద్ధమైనప్పటికీ తనను ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయని గవర్నర్ రాధాకృష్ణన్‌కు వివరించి ప్రభుత్వ సాయం కోసం విజ్ఞప్తి చేశారు. మొత్తం రూ.40 లక్షలకు పైగా ఖర్చు వస్తుందని ఇప్పటి వరకు దాతలు రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు యశ్వంత్ తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే


తొర్రూరు, ఏప్రిల్ 8 : నియోజకవర్గంలో చేపట్టే అన్ని అభివృద్ధి పనులు పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు. గతంలో రూ.3కోట్ల 50లక్షలతో పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసి వెళ్లిన కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్‌లో ఫిల్టర్ బెడ్ కట్టి నిర్మాణ పనులు పూర్తిచేయకుండా పోయిన గత కాంట్రాక్టర్‌పై అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మినీ ట్యాంక్ బండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. పాత టెండర్లు రద్దు చేసి కొత్త పనులు మొదలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కె.నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాంచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, సంతోష్, రాజశేఖర్, పెదగాని సోమయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

▸▸ మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

గార్ల, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని సత్యనారాయణపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంలో ఆటో డ్రైవర్ దొబ్బెటి బుచ్చిరాములు(45) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇల్లందు-మహబూబాబాద్ జాతీయ రహదారి సత్యనారాయణపురం వద్ద ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను మరమ్మతు కోసం రహదారి పక్కన పెట్టారు. మరమ్మతులు చేస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ వేగంతో ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ దొబ్బెటి బుచ్చిరాములు మృతి చెందాడు. మరో ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్సై నిమ్మతోట జీనత్‌కుమార్ చేరుకొని శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో వాటర్ రిఫ్రిజిరేటర్ ఏర్పాటు



వాటర్ రిఫ్రిజిరేటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 8: మహబూబాబాద్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బంది, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన రిఫ్రిజిరేటర్‌ను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వేసవిలో పోలీసు సిబ్బందితోపాటు కార్యాలయంకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లటి నీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ సాంబశివరావు, సోమన్న, ఆర్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

డోర్నకల్, ఏప్రిల్ 8 : డోర్నకల్ మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి అధికారులు సకాలంలో తగు నివేదికలతో హాజరు కావాలని కోరారు.


కేవీకేను సందర్శించిన విద్యార్థులు

కేసముద్రం, ఏప్రిల్ 8 : కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జేవీఆర్ హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లను సోమవారం సందర్శించారు. వివిధ రకాల మొక్కల పెంపకం విధానంపై శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బందెల రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, కృష్ణవేణి, యాదగిరి, మదన్మోహన్, ముదిగిరి సదయ్య, సురేష్, చందర్, లక్ష్మికుమారి, శ్రీవిద్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

గంగారం, ఏప్రిల్ 8 : మండలంలోని పందెం గ్రామానికి చెందిన కురసం సౌందర్య(25) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి బచ్చల స్వామి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పందెం గ్రామానికి చెందిన కురసం సౌందర్య భర్త బాలకృష్ణ వ్యవసాయ పనులు మానుకుని విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తూ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని భార్య సౌందర్య బాలకృష్ణను నిలదీసినా వినకపోవటంతో మనస్తాపానికి గురై ఈ నెల 4న పురుగుల మందు తాగిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను మహబూబాబాద్ వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమమల్లారెడ్డి

దంతాలపల్లి, ఏప్రిల్ 8: దంతాలపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వల్కాద్రి ఉమమల్లారెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వరి ధాన్యాన్ని సకాలం లో కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను కోరారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పశువైద్యాధికారులు ముందస్తు టీకాలు వేసేందుకు గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ దవాఖానాలలోనే సుఖప్రసవాలను చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటిని అందించాలన్నారు. కుమ్మరికుంట్లలో తాగునీటికి తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీటీసీ దుబాకుల వెంకన్న ఆరోపించారు. అర్హులందరికీ ఈజీఎస్ కార్డులు ఇవ్వాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆమె ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం సభ్యులు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వివేక్రమ్, డీటీ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.